గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

హయత్‌నగర్, డిసెంబర్ 18 : హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అతిథి అధ్యాపక నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేశ్ బాబు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 2024-25 విద్యా సంవత్సరానికి జంతుశాస్త్రంలో బోధించేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత పీజీ సబ్జెక్టులో 55శాతం మార్కులు ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ గల అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 21లోపు సర్టిఫికెట్లు తీసుకుని కళాశాల కార్యాలయం నందు సమర్పించాలని కోరారు.

వైశ్యుల అభివృద్ధికి కృషి చేయండి

ఎల్బీనగర్, డిసెంబర్ 18: వైశ్యుల అభివృద్ధికి కృషి చేయాలని ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవాలని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా అన్నారు. బుధవారం శాసనమండలిలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 6 శాతం వైశ్య జనాభా ఉందన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను , చైర్మన్‌ను నియమించారని అదే విధంగా బోర్డు సభ్యులతో పాటుగా నిధులను కేటాయించాలని కోరారు. ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్యులకు చేయూతను ఇవ్వాలన్నారు. ఆర్యవైశ్య విద్యార్థులకు ల్యాప్‌టాప్, విదేశీ విద్యకు ఆర్థిక సహాయం, విద్యార్థి వసతి గృహాలకు ఉచితంగా కరెంటుతో పాటుగా నీరు, లైబ్రరీ సదుపాయాలను కల్పించాలని కోరారు. దీనికి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు.

ఎట్టకేలకు రిలీవ్

సైదాబాద్, డిసెంబర్ 18 : మలక్‌పేట సర్కిల్-6 జీహెచ్ ఎంసీ ఏఎంహెచ్‌వో (అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్) కుర్చీ కోసం ఇద్దరు అధికారుల రభసకు తెర పడింది. బదిలీ అయిన అధికారి రిలీవ్ కాకుండా మరో అధికారికి చార్జ్ ఇవ్వకుండా 40 రోజులపాటు కుర్చీ కోసం పాకులాడిన అధికారి ఎట్టకేలకు తన స్థానం వదిలి వెళ్లారు. మలక్‌పేట సర్కిల్ కార్యాలయంలో ఏఎంహెచ్‌వో సీటులో ఇద్దరు అధికారులు డ్యూటీలు చేస్తున్న వైనాన్ని నమస్తే తెలంగాణ దిన పత్రికలో ఈ నెల 10వ తేదిన ' బదిలీపై వెళ్లలేక...చార్జ్ ఇవ్వలేక ' అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి స్పందించిన జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఉన్నతాధికారులు నివేదిక పంపాలని సౌత్ జోన్ అధికారులను ఆదేశించారు. దీంతో జీహెచ్ఎంసీ సౌత్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న, మలక్‌పేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జయంత్ స్పందించి సంఘటన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. నవంబర్ 7న బదిలీ అయిన అధికారి...చార్జ్ ఇవ్వకుండా 40 రోజుల పాటు అనేక విశ్వ ప్రయత్నాల తర్వాత ఎట్టకేలకు ఉన్నతాధికారుల జోక్యంతో గతంలో జారీ చేసిన ఆదేశాల ఉత్తర్వులు ఆచరణలోకి వచ్చాయి. మంగళవారం సాయంత్రం గత ఉత్తర్వుల మేరకు డాక్టర్ అనురాధ ఫలక్‌నామా సర్కిల్ ఏఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టి మలక్‌పేటలో రిలీవ్ అయ్యారు. మలక్‌పేట సర్కిల్ ఏఎంహెచ్‌వోగా డాక్టర్ రుద్ర శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టడంతో, 40 రోజులపాటు నడిచిన ఒకే కుర్చీలో ఇద్దరి అధికారుల పాలనకు తెరపడింది.

ఔట్ సోర్సింగ్ ఔటేనా..?

- మున్సిపాలిటీలకు నూతన వార్డు ఆఫీసర్లు
- బడంగ్‌పేటకు 29, మీర్‌పేటకు 44, తుక్కుగూడకు 5, జల్‌పల్లికి ఇద్దరు వార్డు ఆఫీసర్ల కేటాయింపు
- అయోమయంలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

బడంగ్‌పేట, డిసెంబర్18: మహేశ్వరం నియోజక వర్గ ఫరిధిలో ఉన్న మున్సిపాలిటీలలో కొత్త వార్డు ఆఫీసర్లు కొలువు దీరనున్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 32 డివిజన్లకు గాను ముగ్గురు వార్డు ఆఫీసర్లు ఉన్నారు. 29 మంది వార్డు ఆఫీసర్లు ఖాళీగా ఉండటంతో ప్రభుత్వం 29 మంది వార్డు ఆఫీసర్లను కేటాయించారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 46 డివిజన్లకుగాను గతంలో ఇద్దరు వార్డు ఆఫీసర్లు ఉండే వారు. కాగా మీర్‌పేటకు 44 మంది వార్డు ఆఫీసర్లను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇద్దరు జూనియర్ అకౌంటెట్లు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లను కేటాయించారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో 28 వార్డులుకు గాను ఇద్దరు వార్డు ఆఫీసర్లను కేటాయించారు. తుక్కుగూడ మున్సిపాలిటీలో 15 వార్డులకు గాను 5 మంది వార్డు ఆఫీసర్లను కేటాయించారు. పది మంది ప్రస్తుతం ఉన్నారు. వార్డులలో, డివిజన్లలో ఉన్న సమస్యలు వార్డు ఆఫీసర్ల చూసుకోవలసి ఉంటుంది. ప్రతి అంశం వార్డు ఆఫీసర్ల పై ఆధార పడవలసి ఉంటుంది. కొత్త వారందరికీ ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది. వీరి తో పాటు ప్రతి మున్సిపాలిటీకి అడిషనల్ కమిషనర్లను కేటాయిస్తున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది పని భారం తప్పింది. గతంలో ఏదైనా అధికారి కంగా చేయవలసిన పనులన్నీ ఔట్ సోర్సింగ్ వారి ద్వారానే చేసే వారు. ట్యాక్స్ మిషన్లు సైతం వార్డు ఆఫీసర్ల చేతులలోకి పోతాయి. ఇప్పటి వరకు బిల్ కలెక్టర్లగా చేసిన వారికి ఏ పని అప్పగిస్తారనేది సందిగ్ధం నెలకొంది. కొన్ని సంవత్సరాల నుంచి పనిచేసిన వారిని ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తారో తెలియని పరిస్థితి. వార్డుకో ఆఫీసర్‌ను కేటాయించడంతో పాత వాళ్లకు పనిలేకుండా పోతుందన్న ఆందోళనలో ఉన్నారు. త్వరలో జీహెచ్ఎంసీలో విలీనం చేయడానికే సిబ్బందిని కేటాయించారన్న గుస గుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం మున్సిపాలిటీలలో పనిచేస్తున్న సిబ్బంది పరిస్థితి ఏమిటన్న ఆలోచన చేస్తున్నారు. కొత్త వారి రాకతో పాత వారిలో గుబులు మొదలైయింది. అధికారులు ఎవరికి ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తారో వేచి చూడాల్సిందే.

గుర్రపు డెక్కతో దోమలు వ్యాప్తి

గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత

సైదాబాద్, డిసెంబర్ 18 : సరూర్‌నగర్ చెరువులో గుర్రపుడెక్క పెరగటంతో దోమల వ్యాప్తి పెరిగిందని ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత అన్నారు. బుధ వారం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో జీహెచ్ఎంసీ మలేరియా, ఎంటమాలజీ విభాగం అధికారులతో కలిసి సరూర్‌నగర్ చెరువులోని గుర్రపు డెక్కను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీల్లో దోమల వ్యాప్తి పెరిగిందని దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయాలన్నారు. చెరువులో పెరుగుతున్న గుర్రపు డెక్క పెరగకుండా చర్యలు తీసుకోవాలని వెంటనే తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మలేరియా, ఎంటమాలజీ ఏఈఓ భారతి, నరేందర్ పాల్గొన్నారు.

అయ్యప్ప మహా పడిపూజ

కాచిగూడ, డిసెంబర్ 18: రాఘవ,ఎన్.కిషోర్ గురుస్వామి ఆధ్వర్యంలో కాచిగూడ నింబోలి అడ్డాలో బుధవారం శ్రీ అయ్యప్పస్వామి మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి హోమంతో పూజ కార్యక్రమంతో ప్రారంభమై పడిపూజ కార్యక్రమంతో ముగిసింది. అయ్యప్పస్వాముల నామస్మరణలతో నింబోలిఅడ్డా ప్రాంతమంతా భక్తి మయమయింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ ఉమా హాజరై అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. రమేశ్‌యాదవ్, గురుస్వాములు శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం

వైదభిక్షం(ఫైల్)

హయత్‌నగర్, డిసెంబర్ 18 : ఇంటి నుంచి వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...హయత్‌నగర్‌లోని విజయనగర్ కాలనీలో వైద భిక్షం కుటుంబ సభ్యులతో కలిసి నివాస ముంటున్నారు. మంగళవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన భిక్షం తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు అతడి ఆచూకీ కోసం చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా దొరకలేదు. కుమారుడు పాపయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

23న వ్యాస రచన పోటీలు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 18: తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రతన్ టాటా జయంతిని పురస్కరించుకుని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో గల సరోజిని నాయుడు వనిత మహావిద్యాలయం ఆవరణలోని ఎంబీఏ బ్లాక్‌లో ఈ నెల 23వ తేదీన తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దూ భాషల్లో వివిధ కళాశాలల్లో ఎంబీఏ చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.వివరాలకు 99488 82604 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రకృతి ఆధారిత ఆహారంపై దృష్టి పెట్టాలి

అలవాట్లపై అవగాహన కల్పిస్తున్న సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ జి.పి. ప్రసాద్

సైదాబాద్, డిసెంబర్ 18 : సైదాబాద్ గడ్డి అన్నారంలోని ఆయుర్వేద వైద్య విధాన పరంపర సంస్థ (ఆయుష్) ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ బోర్డు కాలనీలోని సామాజిక భవనంలో దేశ్ కా ప్రకృతి పరిక్షాన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ జి.పి. ప్రసాద్ మాట్లాడుతూ ఆయుర్వేద దినోత్సవ జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయిలో ప్రజలకు ప్రకృతి ఆధారిత ఆహారం, జీవనశైలి వ్యక్తిగత ఆహార ఎంపిక రోజువారి దిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సమతుల ఆహార అలవాట్లను పాటించాల్సిన అంశాలను కాలనీవాసులకు వివరించామని తెలిపారు. డాక్టర్ సంతోష్‌మానే, డాక్టర్ క్రిస్ ఆంటోనీ, డాక్టర్ వైర ముత్తు, డాక్టర్ దీపికా, డాక్టర్ అంజనా, డాక్టర్ గోపిక, లైబ్రేరియన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థి వేడుకలు

ఆలయ ప్రాంగణంలో గణపతి హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

చంపాపేట, డిసెంబర్ 18: నగరంలోని ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో మరొకటిగా పేరు గావించిన చంపాపేట డివిజన్ పరిధి కర్మన్ ఘాట్‌లోని శ్రీ ధ్యానాంజనేయ దేవస్థానంలో సంకటహర చతుర్థి వేడుకలను పురస్కరించుకుని ఆలయ కార్యనిర్వహణ అధికారి లావణ్య తనదైన శైలిలో భక్తుల సౌకర్యార్థంగా ఆలయాన్ని అన్ని విధాలుగా ముస్తాబు చేయించారు. ఆలయంలో భక్తులు సంకటహర చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేయించారు. బుధవారం ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శాస్త్రోక్తంగా మూలవిరాట్ పాతఃకాల అభిషేకాలు నిర్వహించారు. వీటితో పాటు ఆలయ ప్రాంగణంలో వేదపండితులు చంద్రకాంత్ శర్మ, దైత పవన్‌కుమార్, అర్చకులు సంతోష్ కుమార్, శ్రీనివాస్, స్వామి భక్తి శ్రద్ధలతో గణపతి హోమం నిర్వహించారు. వెంకటయ్య, రమాదేవి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం

ఎల్బీనగర్, డిసెంబర్ 18: ఎల్బీనగర్ నియోజకవర్గంలోని డివిజన్ల అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదని, ఇక్కడ ఆస్తిపన్నులను వసూలు చేస్తూ పాతబస్తీలో ఖర్చు చేస్తున్నారని బీజేపీ కార్పొరేటర్లు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేశారు. జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. తమ డివిజన్లలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసే వరకు తాము ఆందోళన చేస్తామంటూ వారు భీష్మించుకుని కూర్చున్నారు. అనంతరం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు వంగా మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, చింతల అరుణ సురేందర్ యాదవ్, పవన్‌కుమార్, రంగా నర్సింహ గుప్త, బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, నవజీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

సీపీఆర్ చేస్తూ అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హన్మంత్

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 18 : సమాజానికి పని కొచ్చే నైపుణ్యం పిల్లలకు అవసరమని లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ పిలుపునిచ్చారు. బుధవారం శంషాబాద్ పట్టణంలోని ఎంఎంఆర్‌గార్డెన్‌లో వైద్యుడు హన్మంత్‌రెడ్డి దంపతులు, హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమాజానికి పనికొచ్చే నైపుణ్యం పిల్లలకు అవసరమని వివరించారు. రోజుకు లక్షల మంది గుండెపోటుతో మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడితే వారిని మించిన దేవుడు లేరన్నారు. కార్యక్రమంలో శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, కౌన్సిలర్లు మేకల వెంకటేశ్, శంషాబాద్ మండలంలోని ప్రైవేటు పాఠశాల విద్యార్థులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో బీర్ బాటిల్‌తో దాడి

బడంగ్‌పేట, డిసెంబర్18: మద్యం మత్తులో బీర్ బాటిల్‌తో వ్యక్తి పై దాడి చేసిన ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. బడంగ్‌పేటలోని ఎస్‌వీడీ వైన్స్ వద్ద మద్యం సేవించడానికి అల్మాస్‌గూడ రాజీవ్ గృహకల్పకు చెందిన కార్తీక్ అతడి తండ్రి విజయ్ వచ్చారు. మద్యం మత్తులో తండ్రీ కొడుకులు ఇద్దరు గొడవ పడ్డారు. వైన్స్ సూపర్ వైజర్ శ్రీనివాస్ ఇద్దరిని బయటకు పంపించే ప్రయత్నం చేశాడు. తాగిన మత్తులో కార్తీక్ బీర్ బాటిల్‌ను పగల గొట్టి శ్రీనివాస్ పై దాడి చేశాడు. దీంతో ఛాతిలో తీవ్ర గాయం కావడంతో రక్తస్రావం ఎక్కువ కావడంతో దవాఖానకు తరలించారు. శ్రీనివాస్ భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పశు సంపదను కాపాడుకోవాలి

మాజీ ఉపకులపతి డాక్టర్ హఫీజ్

పంజాబ్ శాస్త్రవేత్తకు ఫెల్లోషిప్ అవార్డు అందజేస్తున్న మాజీ వీసీ హఫీజ్,రిజిస్ట్రార్ శరత్‌చంద్ర

వ్యవసాయ యూనివర్సిటీ ,డిసెంబర్ 18 : దేశ వ్యా ప్తంగా పశుసంపదను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణగా పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని శ్రీ వెంకటేశ్వర మాజీ ఉప కులపతి డా.హ ఫీజ్ సూచించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో 33వ నేషనల్ కాంగ్రెస్ నేషనల్ సింపోజియం ఆఫ్ పారాసిటాలజీ అనే అంశంపై రెండో రోజు చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవి జంతువులు, ఫౌల్ట్రీ, జంతువుల నుంచి వ్యక్తులకు వ్యాపించే వ్యాధులపై ప్రభావం చూపే పరాన్న జీవుల నియంత్రణ, చికిత్సపై శాస్త్రీయ సదస్సు నిర్వహించారు. పరాన్న జీవుల ద్వారా జంతువులకు, వ్యక్తులకు వ్యాపించే వ్యాధులను నియంత్రించడానికి ఆధునిక పరిశోధనలపై చర్చ జరిగిందన్నారు. వివిధ విభాగాలలో అపూర్వ ప్రతిభ కనబర్చిన అధ్యాపకులు , విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాకల్టీ డీన్, సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి డా. ఉదయ కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ శరత్ చంద్ర , కళాశాల అసోసియేట్ డీన్ డా. మాధురి, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ వెటర్నరీ పార్సిటాలజీ అధ్యక్షులు డా శంకరణ్, కార్యదర్శి డా. అనిష్ యాదవ్, విశ్వవిద్యాలయ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా. హరికృష్ణ, విస్తరణ సంచాలకులు డా. కిషన్ కుమార్,దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల ఆశాఖ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు

మోదీ హయాంలో బీసీలకు అన్యాయం

మాట్లాడుతున్న జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి

కాచిగూడ, డిసెంబర్ 18: బీసీల ఆకాంక్షలను నెరవేర్చడంలో మోదీ ప్రభుత్వం వైఫల్యం చెందిందని, దేశ ప్రజలు బీజేపీని తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి హెచ్చరించారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీల మనోభావాలను గ్రహించి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో కులగణన తీర్మానం చేసి కేంద్రానికి పంపించి తన నిజాయితీని నిరూపించుకున్నాడని గుర్తుజేశారు. బీసీల భావితరాల కోసం కేంద్ర ప్రభుత్వం జనాభా గణనలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయమే జరుగుతుందని, బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో న్యాయం జరగడంలేదని ఆరోపించారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ఇన్‌చార్జి ఎంపీడీవో గీతకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ కార్యదర్శి బాల్‌రాజ్

కందుకూరు, డిసెంబర్ 18 : పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైనట్లు సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ తెలిపారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ బుధవారం కందుకూరు, పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి ఇన్‌చార్జి ఎంపీడీవో గీతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గ్రామ పంచాయతీ ఉద్యోగులకు నెలకు రూ. 18 వేల వేతనంతో పాటు మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చి 12 నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీని అమలు చేయడం లేదని పేర్కొన్నారు. వేతనంతో పాటు ఈఎస్ఐసీఎస్ సౌకర్యం కల్పించి రూ. 10లక్షల బీమాను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం చలో ఇందిరా పార్కు కార్యక్రమానికి వెళుతుండగా కొంత మంది పోలీసులు అత్యుత్సాహం చూపించి అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం అక్రమంగా నిర్బంధాలను కొనసాగిస్తే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిన్నమ్మ, నర్సింహా, రాములు, జంగయ్య, సురేశ్, శరదమ్మ, హంసమ్మ, గణేశ్ పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

నీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నార్సింగి మున్సిపాలిటీ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్

మణికొండ, డిసెంబర్ 18: అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ వెల్లడించారు. మంచిరేవులలోని ఎస్సీ కాలనీలో బుధవారం రూ. 30 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రజా అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటికి అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో లోటుపాట్లు లేకుండా పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లంకల పద్మవీరారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, మాజీ వార్డు సభ్యులు దొబ్బ లక్ష్మణ్, జి.డి.క్రాంతి, పి.శ్రీనివాస్, రాజు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

20న కథల లోగిలి ఆవిష్కరణ

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 18: లేఖిని రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో 74 మంది రచయిత్రుల కథాసంకలనాలతో ప్రచురించిన కథల లోగిలి చిక్కడపల్లిలోని త్యాగరాయగాన సభలోని కళాసుబ్బారావు వేదికపై ఈనెల 20వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆవిష్కరణ జరుగుతుందని లేఖిని సంస్థ అధ్యక్షురాలు అత్తలూరి విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 74 కథలతో రూపొందిన కథా సంకలనాన్ని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కే.వీ.రమణాచారి ఆవిష్కరిస్తారని తెలిపారు. ప్రముఖ రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి అధ్యక్షతన జరగనున్న ఈ సభలో ప్రముఖ నృత్య గురువు డాక్టర్ ఆర్.ప్రసన్న రాణి, సాహితీవేత్తలు డాక్టర్ ఓలేటి పార్వతీశం, ఉషారాణి సాహితీవేత్తలు పాల్గొంటారన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 18: అదృశ్యమైన వ్యక్తి చెరువులో పడి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తొండుపల్లి చెరువులో వ్యక్తి పడి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు అతడిని బయటకు తీసి చూడగా అతడు మృతి చెందినట్లు గుర్తించారు. రెండు రోజుల క్రితం మండలంలోని కవ్వగూడ గ్రామానికి చెందిన మొట్టు భాస్కర్ (37) మొయినాబాద్ మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఉన్న బంధువుల వద్దకు వెళ్లి అక్కడి నుంచి చెరువులో చేపలు పట్టడం కోసం వెళ్తున్నట్లు చెప్పి వెళ్లి తిరిగి రాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బుధవారం తొండుపల్లి చెరువులో పడి మృతి చెందిన వ్యక్తి మొట్టు భాస్కర్‌గా గుర్తించిన్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

కాచిగూడ, డిసెంబర్ 18: రాబోయే తరాలకు పచ్చదనాన్ని ఇవ్వడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ జీఎస్.గోపాల్‌రెడ్డి అన్నారు. జీవీఆర్ కరాటే అకాడమీ ప్రాంగణంలో కరాటే విద్య